
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.8 ; కనిష్ఠం 27.7





విద్యుత్ సరఫరాలో
అంతరాయానికి అడ్డుకట్ట

- ఎన్పీడీసీఎల్‌లో కొత్త సాంకేతిక పరిజ్ఞానం
- కమాండ్ కంట్రోల్ సిస్టం ఏర్పాటు
- అందుబాటులోకి చాట్‌బాట్, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం
- 33/11 కేవీ పోల్స్‌కు యూనిక్ నెంబర్లు

నిర్మల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ తరహాలోనే విద్యుత్ సరఫరా వ్యవస్థలో కూడా ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం అనేక కొత్త సంస్కరణలకు శ్రీకారంచుడుతోంది. ఇందులో భాగంగానే విద్యుత్ వినియోగదారులకు కరెంటు సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఆధునిక టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటూ సంస్థ పనితీరును మెరుగుపరచుకోవడం అలాగే కోతలు లేకుండా వినియోగదారులకు కరెంటు సరఫరా చేయడం, బిల్లులు సక్రమంగా వసూలు చేయడం, తమకు అందే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవడం లాంటి వాటిపై విద్యుత్‌శాఖ ఫోకస్ పెడుతోంది. దీనికోసం నిర్వహణ వ్యవహారం అంతా ఇక ఆన్‌లైన్‌లోనే చేపట్టేందుకు ఎన్పీడీసీఎల్ సిద్ధమైంది. ఇప్పటికే పలు యాప్‌లను అమలులోకి తెచ్చిన ఆ సంస్థ ఇక కామండ్ కంట్రోల్‌సిస్టం ఏర్పాటు చేసి బిల్లింగ్, కలెక్షన్, ఇంటరప్షన్, కంప్లైంట్స్ లాంటి వివరాలన్నింటినీ ఒకేచోట అందుబాటులో ఉంచబోతోంది. కరెంటు సరఫరాకు అంతరాయం ఎక్కడ ఏర్పడిందోనన్న విషయాన్నీ అప్పటికప్పుడే తెలుసుకునేందుకు కూడా ఆ సంస్థ పలు చర్యలు చేపట్టింది. 33 అలాగే 11 కేవీ విద్యుత్ స్తంభాలకు యూనిక్ నెంబర్లను కేటాయించింది. ఈ పోల్ నెంబర్ ద్వారా లోకేషన్ మ్యాపింగ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్‌లలో ఏర్పడే అంతరాయాలను గుర్తించనున్నారు.

డిస్కం సమాచారం కోసం డాష్ బోర్డు అప్లికేషన్

డిస్కంకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచేందుకు కోసం డాష్‌బోర్డు అప్లికేషన్‌ను ఈ సంస్థ తెరపైకి తెస్తుంది. దీని కారణంగా వర్క్‌ఫోర్స్ మేనేజ్మెంట్, అవుటేజ్ మేనేజ్మెంట్ సిస్టం, డిమాండ్ సైడ్ మేనేజ్మెంట్, కస్టమర్ పోర్టల్ సిటిజెన్ మేనేజ్మెంట్ సిస్టం, మీటర్ డాటా మేనేజ్మెంట్‌కు సంబంధించిన అంశాలన్నింటినీ ఇటు సంబంధిత అధికారులు, సిబ్బంది అటు సాధారణ విద్యుత్ వినియోగదారులు తెలుసుకునే అవకాశం ఏర్పడబోతోంది. అలాగే కరెంటు సరఫరాలో జరుగుతున్న అంతరాయాలను లెక్కించేందుకు రెండు కొత్త ఇండెక్స్ సిస్టంలను అమలు చేయనున్నారు. సిస్టం యావరేజ్ ఇంటరప్షన్ డురేషన్ ఇండెక్స్ (సైదీ), అలాగే సిస్టం యావరేజ్ ఇంటరప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్ (సైఫీ)లతో విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాలను రోజువారీగా లెక్కించనున్నారు. దీంతో కరెంటు సరఫరాలో సగటుతో పాటు మొత్తం ఎన్నిసార్లు అంతరాయం జరిగిందనే విషయాలను తెలుసుకునేందుకు రియల్ టైం డాటా అందుబాటులోకి రానుంది. ఈ వివరాలన్నింటినీ ఏడాది పాటు అందుబాటులో కూడా ఉంచ బోతున్నారు.

చాట్ బోట్‌లో సమాచారం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా కొనసాగుతున్న చాట్ బోట్‌లో ఎన్పీడీసీఎల్ సంస్థకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచనున్నారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టంను అందుబాటులో ఉంచి కమాండ్ కంట్రోల్ సిస్టంలోని వివరాలన్నింటినీ తెలుసుకునే అవకాశం కల్పించనున్నారు. అలాగే అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్ అనే సిస్టం కూడా అమలు చేస్తున్నారు. 33, 11 కేవీ విద్యుత్ స్తంభాలకు యూనిక్ నెంబర్‌ను కేటాయించి ఆ పోల్‌ల వారీగా వాటి నెంబర్లతో లోకేషన్ మ్యాపింగ్ చేపడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్‌లలో ఏర్పడే అంతరాయాలను ఎప్పటికప్పుడు తొలగించనున్నారు.

సత్వర పరిష్కారానికే..



నాగరాజు, ఎన్పీడీసీఎల్, డీఈ

పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని సబ్ స్టేషన్ల పరిధిలో గల విద్యుత్ స్తంభాలకు జియో టాగింగ్ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీని వల్ల నూతనంగా వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రతి విద్యుత్ స్తంభం ఆన్‌లైన్‌తో అనుసంధానమై ఉంటుంది. ఎక్కడైనా విద్యుత్ సరఫరా అంతరాయం జరిగినప్పుడు అది ఎక్కడ జరిగిం దనేది జియో టాగింగ్ ద్వారా సత్వరమే గుర్తించే అవకాశం ఉంటుంది. దీంతో తమ సిబ్బంది వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అనువుగా ఉంటుంది. ప్రజలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకే ఎన్పీడీసీఎల్ ఆధ్వరయంలో ఇలాంటి కొత్త కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాము.



విద్యుత్ స్తంభానికి ఏఓక్ నెంబరు వేస్తున్న దృశ్యం

పీసీసీ జిల్లా పరిశీలకుడిగా శేఖర్‌గౌడ్



కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో శేఖర్‌గౌడ్

నిర్మల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జిల్లాల పరిశీలకులుగా పలువురు నాయకులను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నిర్మల్ జిల్లాకు పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్ నియమితులయ్యారు. జిల్లాల పరిశీలకులుగా నియమితులైన నాయకులు ఆయా జిల్లాలకు వెళ్లి పార్టీ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సిద్ధం చేయాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు జిల్లా పరిశీలకుల నియామకం చేశారు. ఈ మేరకు తనను నిర్మల్ పరిశీలకుడిగా నియమించినందుకు మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్‌లకు శేఖర్‌గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా నూతన న్యాయాధికారిని కలిసిన ఎస్పీ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.శ్రీవాణిని జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. న్యాయమూర్తికి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదనపు ఎస్పీలు ఉపేందర్‌రెడ్డి, అవినాష్‌కుమార్, రాజేష్ మీనా, పలువురు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీవాణి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీవాణి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : చెక్ బౌన్స్ కేసులను రాజీ పద్ధతుల్లో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి అన్నారు. గురువారం బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. చెక్ బౌన్స్ కేసుల పరిష్కారంపై చర్చించారు. జిల్లాలోని బ్యాంకులు, చిట్ ఫండ్ కంపెనీలలో నమోదై పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను పరస్పర రాజీ మార్గాన పరిష్కరించుకోవాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో వేసవి క్రీడా శిబిరాల నిర్వహణ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు యువజన క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రాల్లో 19, గ్రామీణ ప్రాంతాల్లో 10 శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 7013396536 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జిల్లాలో పలుచోట్ల రెడ్‌అలర్ట్

- వరుసగా రెండో రోజూ 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- మూడు మండలాల్లో రెడ్ అలర్ట్ జారీ

ఖానాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెడ్‌అలర్ట్ కొనసాగుతోంది. జిల్లాలో వరుసగా రెండో రోజు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. ఈ వేసవి ఆరంభమయ్యాక బుధవారం తొలిసారిగా జిల్లాలోని నాలుగు మండలాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా గురువారం సైతం మూడు మండలాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని తానూర్, ముథోల్, కడెం మండలాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఈ మూడు మండలాల్లో అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. జిల్లాలో అత్యధికంగా తానూర్ మండలంలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో మూడు మండలాల్లో రెడ్ అలర్ట్, మిగతా మండలాల్లో ఆరెంజ్ అలర్ట్‌ను అధికారులు జారీ చేశారు. భారీగా ఉష్ణోగరతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

బాసర ఆర్జీయూకేటీలో కొనసాగుతున్న సమ్మె



ఆర్జీయూకేటీ ప్రధాన గేట్ వద్ద ధర్నా చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు

బాసర, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీలో ఒప్పంద అధ్యాపకుల నిరవధిక సమ్మె కొనసాగుతుంది.నాలుగవ రోజు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు.ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు శ్రీశైలం మాట్లాడుతూ ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలో ఉన్న అన్నీ విశ్వవిద్యాలయాల్లో ఈ సమ్మె కొనసాగుతుందని పేర్కొన్నారు.ఆర్జీయూకేటీ ప్రారంభమే కాంట్రాక్ట్ వ్యవస్థతో మొదలైన విషయం గుర్తు చేశారు.కాంగ్రెస్ హాయంలో ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నామని అన్నారు.గత ప్రభుత్వం జె ఎల్, డి ఎల్ , పి ఎల్ లను క్రమబద్ధీకరించి విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను విస్మరించిందని ,ఇలా విస్మరణకు గురైన అధ్యాపకులను ప్రజా ప్రభుత్వం సీ ఎం రేవంత్ రెడ్డి క్రమబద్ధీకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాములు,బసవ శేఖర్, బాల చందర్ ,రజిత ,శిరీష తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌కు గురై ఒకరి మృతి



ధనే విజయ్ (ఫైల్)

నర్సాపూర్(జి), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డొంగుర్‌గాం గ్రామానికి చెందిన ధనే విజయ్(51) మోటార్లు పనిచేయడం లేదని ఈ నెల 11వ తేదీన సాయంత్రం జంగిపల్లి చిన్నయ్య వ్యవసాయ పొలంలో గల ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మోటార్ ఫైవులను చెక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విజయ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే వారి కుటుం బ సభ్యులు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మరుసటి రోజు మెగురైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. బుధ వారం గాంధీ ఆసుపత్రి వారు డిశ్చార్జ్ చేయగా విజయ్‌ని తన కుటుంబ సభ్యు లు డొంగుర్‌గాం తీసుకవచ్చారు. గురువారం ఉదయం తెల్లవారు జామున విజ య్ మరణించాడు. మృతుడి తమ్ముడు ధనే వినయ్ నర్సాపూర్ పోలీస్ స్టేషన్ యందు దరఖాస్తు ఇవ్వగా ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కడెంలో రెండు ఇళ్లల్లో చోరీ

కడెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బుచ్చ గౌడ్, నాళం రామక్క అనే ఇద్దరి ఇళ్లలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. సుమారు 2 తులాల బంగారం, 10 తులాల వెండి, 3,200ల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న ఖానాపూర్ సీఐ, కడెం ఎస్సై కేసు నమోదు చేసి క్లూస్ టీం సహాయంతో దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామపాలన అధికారుల నియామకంతో

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

రైతువేదిక



నర్సాపూర్(జి) మండలం కేంద్రంలో అవగాహన సదస్సులో కలెక్టర్

నర్సాపూర్(జి), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో గ్రామ పాలన అధికారులను నియమించడం ద్వారా ప్రజల భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రజలకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల భూ సమస్యలు సులువుగా పరిష్కరించేందుకు వీలుగా నూతన భూ భారతి చట్టం రూపొందించారని తెలిపారు. ఎంతో మంది అనుభవజ్ఞులైన అధికారులు, భూ చట్టాల నిపుణులు, న్యాయ నిపుణులు రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసుకొని, ఎన్నో రాష్ట్రాల భూ చట్టాలను పరిశీలించిన తర్వాత సమగ్ర భూ భారతి చట్టాన్ని రూపొందించారని తెలిపారు. నూతన భూ భారతి చట్టం అమలుతో తహసీల్దార్ స్థాయిలోనే ఎన్నో భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అన్ని భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారానికి నిర్ణీత గడువును విధించారని తెలిపారు. సాదా బైనామా ప్రక్రియ తిరిగి వినియోగంలోకి రాబోతోందన్నారు. భవిష్యత్తులో ఎటువంటి భూ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకై రైతుల పట్టాదారు పాసు పుస్తకంలో వారి భూములకు సంబంధించి వివరాలను మ్యాపింగ్ రూపంలో పొందుపరుస్తారన్నారు. ఈ సమావేశంలో భాగంగా రైతులు ఎదుర్కొంటున్న పలు భూ సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యల పరిష్కారం లభిస్తుందని వారికి హామీ ఇచ్చారు. ఈ భూభారతి అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, మండల ప్రత్యేక అధికారి అంజిప్రసాద్, రైతులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

- అవగాహన సదస్సులో కలెక్టర్ అభిలాష అభినవ్



సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తున్న రైతు

లోకేశ్వరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతువేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో గురువారం కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ధరణి వ్యవస్థతో రైతులు ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా భూములపై పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తాయన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామాలకు వచ్చి నేరుగా అర్జీలను స్వీకరించి నిర్ణీత కాలంలో సమస్యను పరిష్కరిస్తారన్నారు. ఇక నుండి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రైతులు తమ హక్కులను చట్టబద్ధంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. దీంతో రైతులు తమ భూ సమస్యలను సభలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి సమాచారాన్ని అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులకు దరఖాస్తులను ఇవ్వాలని సూచించారు. రిజిస్టర్లలో రైతులకు సమస్యలు ఉన్న పేర్లను నమోదు చేసి అందజేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, లోకేశ్వరం పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, లోకేశ్వరం తహసీల్దార్ మోతిరామ్, ఎంపీడీవో రమేష్, ఎంపీవో సల్మాన్‌రాజ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సౌజన్య కపిల్, భుజంగ్‌రావు, సాయన్న, మెండే శ్రీధర్, జయసాగర్‌రావు, మామిడి నారాయణరెడ్డి, ఎండీ షఫీ, భోజన్న, సుధీర్‌రెడ్డి, రైతులు, తదితరులున్నారు.

బెట్టింగ్ భూతంతో జీవితాలు బుగ్గిపాలు

- భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్



భైంసాలో మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసా, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ భూతాలతో జీవితాలు బుగ్గిపాలవుతాయని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ వెల్లడించారు. గురువారం భైంసా పట్టణంలోని పిప్రి కాలనీ పరిధిలో గల సంబాజీ చౌక్ ప్రాంతంలో టౌన్ సీఐ గోపినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ బెట్టింగ్,ఆన్‌లైన్ జూదాల జోలికి వెళ్లకూడదని సూచించారు. బెట్టింగ్ నిర్వాహకుల వివరాలు అందిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇదే క్రమంలో సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో మోసాలకు తెరలేపుతున్న దృష్ట్యా అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎవరితోనూ బ్యాంక్ అకౌంట్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ వివరాలు తెలుపరాదన్నారు. సెల్‌ఫోన్‌కు తెలియని నెంబర్ల నుంచి వచ్చే లింక్‌లను తెరువరాదన్నారు. మత్తు పదార్థాలను వినియోగించరాదన్నారు. గంజాయి విక్రయాలు జరిగిన పోలీసుశాఖకు సమాచారం అందించాలన్నారు. కొత్త వ్యక్తులు, అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు వెంటనే సమాచారం తెలుపాలన్నారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి గాను ప్రతి ఒకరూ రోడ్డు భద్రత నియమావళిని పాటించాలన్నారు. దొంగతనాల నివారణకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతగానో తోడ్పతుందని తెలిపారు.. ఈ సందర్భంగా సంబాజీ నగర్ ప్రాంతంలో పోలీసుశాఖ చేపట్టిన తనిఖీల్లో సరియైన ధృవీకరణ పత్రాలు లేని 66 దిచక్ర వాహనాలు, 2ఆటోలను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు సన్మానం

బాసర,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):జాతీయ పంచాయతీ రాజ్ శాఖ దినోత్సవం పురస్కరించుకొని గురువారం బాసర గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.పంచాయతీ కార్యదర్శి. ప్రసాద్ స్థానిక వివిధ పార్టీల నాయకులు కార్మికులను షాలువతో సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు.ప్రజల జనజీవనం సజావుగా సాగడానికి కార్మికుల కృషి వేలకట్టలేనిదని.పంచాయతీ శాఖలో కార్మికులే ప్రధాన పాత్ర అని కార్యదర్శి ప్రసాద్ చేప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ జాదవ్ కృష్ణ, మండల బీజేపీ అధ్యక్షులు పుట్నాల సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



కదం ప్రకాష్ (ఫైల్)

భైంసా రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిర్జాపూర్ గ్రామానికి చెందిన కదం ప్రకాష్(41) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కదం ప్రకాష్ ఆర్థిక ఇబ్బందులతో కుటుంబపోషణ భారమై, మద్యానికి బానిసై తనలో తానే మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. తన ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగడంతో అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శంకర్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కొడుకులు ఉన్నారు.

మిషన్ భగీరథ సంపులో పడి..

కుభీర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతర్ని గ్రామంలో గురువారం మిషన్ భగీరథ సంపులో పడి సుక్లీకర్ సురేష్(32) మృతి చెందినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. వివరాల ప్రకారం... మృతుడు మహారాష్ట్రలోని ఉమ్రి గ్రామానికి చెందిన సుక్లీకర్ సురేష్(32) కు అంతర్ని గ్రామానికి చెందిన రోజా అనే అమ్మాయితో వివాహం జరిగి ఇల్లరికంగా అంతర్నిగ్రామంలో ఉంటున్నాడు. అయితే మంగళవారం భార్యభర్తలిద్దరి మధ్య గొడవకు జరగడంతో మృతుని భార్య తన అక్క ఇంటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన మృతుడు సురేష్ మద్యం తాగి జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని మిషన్ భగీరథ సంపులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం 11.30గంటలకు మిషన్ భగీరథ అపరేటర్ గమనించి గ్రామస్థులకు సమాచారం అందించాడు. ఈ మేరకు మృతుడి తల్లి సుమన్ బాయి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కుంటాలలో స్టార్టర్ చోరీ

కుంటాల, ఏప్రిల్, 24 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల గ్రామపంచాయతీ నర్సరీకి నీరందించే మోటారు స్టార్టర్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. నర్సరీకి సంబంధించిన స్టార్టర్ కావడంతో నీరందించడం ఇబ్బందిగా మారిందని, దీని విలువ రూ. 4 వేల వరకు ఉంటుందని పంచాయతీ సిబ్బంది తెలిపారు.

లింబా (బీ)లో గేదెల చోరీ

కుంటాల, ఏప్రిల్, 24 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింబా(బీ) గ్రామానికి చెందిన రవీంధర్‌సింగ్ అనే రైతు యొక్క రెండు గేదెలు బుధవారం రాత్రి చోరీకి గురయ్యారు. వీటి విలువ లక్ష రూపాయల వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొంటున్నాడు. అంతేగాకుండా గ్రామానికి చెందిన జక్కుల సంతోష్ చెందిన ఆవు దీని విలువ రూ. 16 వేల వరకు ఉంటుందని, మరొక ఆవు గ్రామానికి చెందినది దాని విలువ రూ. 60 వేల వరకు ఉంటుందని గేదెలు గ్రామంలో నుండి చోరీకి గురికావడంతో గ్రామస్థులకు ఆందోళనకు గురవుతున్నారు.

పెన్షనర్ల కుటుంబాలకు

నేడు కంటి ఉచిత పరీక్షలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లు, వారి కుటుంబాలకు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఎంసీ.లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల సంఘ భవనంలో నిర్వహించే శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ



ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేక అధికారి

బోథ్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక అధికారి వాజిద్ అలీ పాల్గొనగా తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఎంపీడీవో రమేష్, ఎంపీఈవో అఖిల్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 25 మంది పలు రకాల ఫిర్యాదులు చేశారు. పెద్దమొత్తంలో వంట గ్యాస్ సబ్సిడీ రావడం లేదని మరికొంతమంది విద్యుత్ బిల్లులు జీరో రావడం లేదంటూ ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు పెరిగిపోయాయని ఫలితంగా వర్షాకాలం ఇబ్బందులు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన అధికారులు సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

'మాకు ఉపాధి కల్పించండి'



దన్నూర్ బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న కూలీలు

బోథ్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జొన్నలు తూకం వేసేందుకు అవకాశం ఇవ్వాలని గురువారం ధనుర్ బస్టాండ్ వద్ద కూలీలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. తాము ఉపాధి లేక ఇబ్బందులకు గురవుతున్నామని అయితే మార్కెటింగ్ అధికారులు బీహార్ నుంచి వచ్చిన వలస కూలీలతో పనులు చేస్తున్నారన్నారు. తమకు కూడా పని కల్పించాలని కోరారు.

'కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరుకావాలి'

నార్నూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కొమురం భీరం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కొకిరాల విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు ఆదివారం రోజున ఆసిఫాబాద్‌లోని ప్రేమల గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ సమావేశం ఉందని కాంగ్రెస్ పార్టీ నార్నూర్ మండల అధ్యక్షులు దేవురావు లోకండే తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గ్రంథాలయం చైర్మన్ ప్రొఫెసర్ రియాజ్, నర్సయ్య హాజరవుతున్నారు. సకాలంలో మండలానికి చెందిన పార్టీ కార్యకర్తలు పార్టీ యూత్ కాంగ్రెస్ సెల్, ఎస్సీ సెల్, మైనార్టీ సెల్, ఎన్ఎస్‌యూ, అభిమానులు మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సబ్‌స్టేషన్ కెపాసిటర్ బ్యాంక్ వేడి అయి పగిలి మంటలు విరజిమ్మాయి. ఆ నిప్పు రవ్వలు కింద ఉన్న చెత్తకు అంటుకొని విస్తరించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఫైర్‌ఇంజిన్ సాయంతో ఆర్పి వేశారు. అగ్ని ప్రమాదం నేపథ్యం లో ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు.

జిల్లా కలెక్టర్‌ను సన్మానించిన నాయకులు



ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌ను సన్మానిస్తున్న అధికారులు

తలమడుగు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్రమోది చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాను గురువారం తలమడుగు మండలం కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు సన్మానించారు. మాజీ జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా ప్రజల అప్యాయత అభిమానం మర్చిపోలేనిదన్నారు. ఇటీవల జిల్లా అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా నార్నూర్ బ్లాక్ అస్పరేషనల్ ప్రోగ్రాం 2024కు గాను కలెక్టర్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఢిల్లీలో ప్రధానమంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా గోక గణేష్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి మరిన్ని అవార్డులు ఇలాగే అందుకోవాలని ఆన్నారు. మండల ప్రజల తరఫున ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆదిలాబాద్ కలెక్టర్‌ను సత్కరించిన జిల్లా ఉన్నతాధికారులు

ఆదిలాబాద్ రూరల్: ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారానికి ఎంపికై ప్రధాని మోడీ చేతుల మీదుగా అవార్డును స్వీకరించిన కలెక్టర్ రాజర్షిషాకు వివిధ శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు సత్కరించారు. గురువారం ఆదిలాబాద్‌లో కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి ప్రధాని చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న చిత్రాన్ని జ్ఞాపికగా అందజేశారు. అందరి కృషితోనే జిల్లాకు అవార్డు లభించిందన్నారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఉన్నారు.

అనుమతులు లేకుండానే గ్రానైట్ వ్యాపారం



బోథ్ మండల కేంద్రంలో గ్రానైట్ దుకాణం

బోథ్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అనుమతి లేకుండా గ్రానైట్ వ్యాపారం నిర్వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రతి ఏడాది లక్షల రూపాయల్లో జరిగే ఈ వ్యాపారం ఎలాంటి అనుమతులు లేకుండానే కొనసాగిస్తున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. అయితే ప్రధాన రోడ్ల సమీపంలో నిర్వహిస్తున్న ఈ వ్యాపార వ్యవహారాన్ని అధికారులు సైతం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

● **ఎలాంటి అనుమతులు లేవు**

మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రానైట్ వ్యాపారానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని గ్రామపంచాయతీ ఈవో అంజయ్య తెలిపారు. అయితే మండల కేంద్రమైన సమీపంలో నిర్వహిస్తున్న ఈ షాపు యజమాని ఇంతవరకు తమ ద్వారా ఎలాంటి అనుమతులు తీసు కోలేదని తెలిపారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఎలాంటి వ్యాపారానైనా సీజ్ చేస్తామన్నారు. ప్రభుత్వ ఆదాయానికి లక్షల రూపాయలు గండి కొట్టి నిర్వహించి ఇలాంటి వ్యాపారులపై అధికారులు దృష్టి సారిస్తే ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు గ్రామపం చాయతీకి పన్ను రూపంలో ఆదా యం వచ్చే అవకాశం ఉంది.

ఉగ్రదాడికి పాల్పడడం సిగ్గుమాలిన చర్య



మృతులకు నివాళులర్పించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మౌనం పాటిస్తూ నివాళులర్పించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ కాశ్మీర్‌లో గల పహల్గాంలో ఉగ్రదాడులకు పాల్పడటం సిగ్గుమాలిన చర్య అని బీఆర్ఎస్ పార్టీ తరఫున తీవ్రంగా ఖండించారు.

తలమడుగు : మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అమాయక ప్రాణాలు తీసుకున్న ఉగ్రవాదులను హతమార్చాలని వారు కోరారు. ఇందులో అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షులు దేవన్న, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎండల దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ సెంటర్లకు సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు మే నెలంతా సెలవులపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరుతూ గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కనీసవేతనం, ఉద్యోగ భద్రతతోపాటు గతంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలున్నారు.

గిరిజనులపై అక్రమ కేసులు వద్దు

● జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్



మాట్లాడుతున్న మాజీ జిల్లా పరిషత్ చైర్మన్

నార్నూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లుగా బుధ వారం మండల కేంద్రానికి చెందిన గిరిజన నాయకుడు పాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడె ఇంటికి పోలీసులు వెళ్లి సోదాలు చేయడం చాలా బాధాకరమైన అంశమని ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. గురువారం సేవాలాల్ భవనంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, లంబాడా హక్కుల పోరాట సమితి, అల్ ఇండియా బంజారా సేవాసంఘం, ఇతర నాయకులు దాదాపు వంద మందికి పైగా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ఇప్పుడు రాజకీయంగా ఎదుగుతున్న వ్యక్తిపై ఇలాంటి తప్పుడు కేసు చేయడం ఏంటని ప్రశ్నించారు..? అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేసి భయభ్రాంతులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాదవ్ రెడ్డి నాయక్, యశ్వంత్ రావు చవాన్, భీంపూర్ మాజీసర్పంచ్ రాజునాయక్, సయిద్ కాషిం, చంద్ర శేకర్ లోకండే, బీజేపీ మండల అధ్యక్షులు బిక్కురాథోడ్, షేక్ మజిత్, విజయసింగ్ ఆడె, చవాన్ ప్రకాష్, అశోక్ రాథోడ్, మోహన్ పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై కేసుల నమోదు

ఇచ్చోడ, ఏప్రిల్, 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో వడ్డీవ్యాపారం నిర్వహిస్తున్న పలువురి ఇళ్లు, దుకాణాలు, ఆఫీసులపై బుధవారం పోలీసులు దాడిచేసి సోదాలు నిర్వహించారు. వారి ఇళ్ల, దుకాణాల నుంచి పలు డాక్యుమెంట్లు, ఆస్తి పత్రాలు, బాండ్లు, ప్రామిసరి నోట్లు తదితర దస్తావేజులను పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఇచ్చోడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 10 కేసులు నమోదయ్యాయి. ఇచ్చోడకు చెందిన పాన్‌పట్టే సుభాష్, భాస్కర్‌వార్ అమూల్, తొరె సంజయ్, ఉడాన్స్ మోహన్, కదం సుదర్శన్, బల్లం నరేందర్, పాన్‌పట్టే సుధాకర్, విజయ్ కుమార్, ఆమ్టె జ్ఞానేశ్వర్, వన్నెల కృష్ణలపై కేసులు నమోదయ్యాయి.

ఆరుగురిపై ..

బోథ్ : మండలంలో రోజువారి ఫైనాన్స్ విధానం ద్వారా కొంత మంది వ్యక్తుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలతో వ్యాపారాలు చేస్తున్నారని, నిబంధనలకు అనుగుణంగా ఎవరూ వడ్డీ వ్యాపారాలు చేసినా కేసులు తప్పవని బోథ్ ఎస్సై ప్రవీణ్ తెలి పారు. మండల కేంద్రానికి చెందిన రాయిపల్లి రమాకాంత్ ఎర్రాల ఉమేష్, సాయినగర్ కాలనీకి చెందిన వ్యక్తి కాగా, జాదవ్ కిషోర్, సామల గంగారాం, ధనుర్ బీ గ్రామానికి చెందినవాడు కాగా ఈయ నతో పాటు ఎస్.భీమన్న నడిపి గంగయ్యలు ఈ విధమైన వడ్డీ వ్యాపారాన్ని చేస్తున్నారన్నారు. ఈ విధమైన వడ్డీ వ్యాపారం చేయ డం చట్టరీత్యా నేరం అయినందున వారిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

నిరుపేద బాలిక వివాహానికి సాయం

ఉట్నూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల క్రితం నాన్న జాదవ్ గణేష్ చనిపోవడంతో తల్లి శారదాబాయి పిల్లలను పెంచడంతోపాటు విద్యాబుద్ధులు నేర్పించడానికి ఎంతో కష్టపడింది. కూలి నాలి చేసి పిల్లలను పోషించిన ఆ తల్లి కూతురుకు మాత్రం కష్టపడి చేయించింది. పెళ్లి సమయం రావడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శారదాబాయికి ఉట్నూర్‌కు చెందిన టీచర్ శ్రీనివాస్ సామాజిక సేవలు చేస్తున్న విధంగానే బాలిక వివాహం కోసం 20 వేల ఆర్థిక సహాయం చేశారు. గురువారం ఉట్నూర్ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా బాలిక వివాహం కోసం రూ.20 వేలు అందించి తన సామాజిక సేవ చాటుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు శ్రీనివాస్‌ను ప్రశంసించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ అమృత్యులాల్, వ్యవసాయ అధికారి రమేష్ పాల్గొన్నారు.

అటల్ బిహారీ వాజపేయి జీవితం భావితరాలకు స్ఫూర్తి



వాజపేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని స్వర్గీయ అటల్‌బిహారీ వాజపేయి జీవితం, ఆయన ప్రసంగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. అటల్ జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంనాథ్‌ను పార్టీ సన్మానించింది. బీజేవైఎం అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, నాయకులు పొన్నం నారాయణగౌడ్, తోట సత్యనారాయణ, రచ్చ మల్లేష్, కొండయ్య, అలివేలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం కావాలని

పొట్టపెల్లి(కే) రైతుల రాస్తారోకో



ధర్నా చేస్తున్న రైతులను సముదాయిస్తున్న ఎస్సై రహమాన్ మాలిక్

లక్ష్మణచాంద, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామానికి కొనుగోలు కేంద్రం మంజూరు చేయాలని మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామ రైతులు మండల రహదారిపై గురువారం ధర్నా నిర్వహించి రాస్తారోకో చేశారు. దీని వలన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ గోదాముల నిర్మాణం కోసం గ్రామస్థులు భూమి ఇచ్చారని అయినా కొనుగోలు కేంద్రం మంజూరు చేయకపోవటం విడ్డూరమని అసహనం వ్యక్తం చేశారు. అధికారులకు వ్యతిరేకంగా నినదించారు. వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై రహమాన్ మాలిక్ ధర్నా చేస్తున్న ప్రాంతానికి వచ్చి నచ్చజెప్పారు. ఎంతకీ రైతులు వినకపోవటంతో తహసీల్దార్ జానకితో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. సాయంత్రం లోగా ధాన్యం కొనుగోలు ఉప కేంద్రం (సబ్‌సెంటర్) మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించి ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో పొట్టపెల్లి గ్రామ రైతులు, యువకులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

తానూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తానూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే రామరావుపాటిల్, భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనందరావుపాటిల్‌లు జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామరావుపాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన జొన్న పంటకు క్వింటాలుకు రూ. 3371 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. ఎకరానికి 14క్వింటాళ్ల చొప్పున ప్రాథమిక వ్యవసాయ సంఘం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ స్టేట్ డైరెక్టర్ గంగాచరణ్, తహసీల్దార్ లింగమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్ రావుపాటిల్, వైస్ చైర్మన్ నాగనాథ్, డైరెక్టర్లు పుండ్లీక్, గోవిందరావు పాటిల్, నాయకులు చిన్నారెడ్డి, లక్ష్మారెడ్డి, శివాజీ పటేల్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులున్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ



హిందూవాహిని ఆధ్వర్యంలో మృతులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిపై గురువారం పట్టణంలోని హిందూ వాహిని ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని వివేకానంద చౌక్‌నుంచి గాంధీచౌక్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గాంధీచౌక్ వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ జిల్లా ధర్మజాగరణ బాధ్యులు రాజేష్‌సింగ్ మాట్లాడుతూ... హిందువులను లక్ష్యంగా చేసుకొని జరిపిన ఉగ్రదాడి చేసిన ఉగ్రవాదులను ఈ దేశంలో ఉండి వారికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ హిందూ సమాజం ఇప్పటికైనా హిందువులు ఏకం కాకపోతే ఇలాంటి సంఘటనలు జరిగితే దేశం విచ్ఛిన్నం అయ్యే సూచనలు బాగా ఉంటాయి. ప్రతి ఒక్క హిందువులు ఐకమత్యంగా ఉంటూ దేశాన్ని, ధర్మాన్ని కాపాడుకోవాలని హిందూవాహిని శాఖ తరుపున పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో హిందూవాహిని పట్టణ అధ్యక్షులు మంద పవన్, సహ సంయోజక్ ముఖేష్, ఆకాష్, మనోజ్, మహేష్, బద్రి, సాయి దేశ్ పాండే, హిందూవాహిని నగర కార్యకర్తలు, హిందూ సంఘాలు, వ్యాపారులు, హిందూసమాజం పాల్గొనడం జరిగింది.

బీజేపీ ఆధ్వర్యంలో..

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ బుధవారం రాత్రి నిర్మల్‌లోని శివాజీ చౌక్‌లో బీజేపీ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించింది. మరణించిన మృతులకు నివాళులర్పించారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య దాడిని ఖండించారు. ఆయన మాట్లాడుతూ... హిందువులపై పాశవికంగా ఉగ్ర దాడి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. అమాయకులైన పర్యాటకులను పొట్టనపెట్టుకున్నారని, బాధిత కుటుంబాలకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మృతుల ఆత్మకు శాంతి కలుగాలని ప్రార్థించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు కమల్ నయన్, అలివేలు, ఆడెపు సుధాకర్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న బీజేపీ



ఖానాపూర్‌లో పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఉగ్రవాదాన్ని తుదముట్టించే వరకూ

దేశ పౌరులంతా కంకణబద్ధులై పోరాడాలి

ఖానాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదాన్ని తుద ముట్టించే వరకు దేశ పౌరులంతా కంకణబద్ధులై పోరాడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ బుధవారం రాత్రి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఘటనలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ స్థానిక ఎన్టీఆర్ చౌక్ నుండి తెలంగాణ తల్లి చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. పార్టీలకు అతీతంగా సాగిన ఈ శాంతి ర్యాలీకి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం, అంకం రాజేందర్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు మంత్రరాజం సురేష్, ప్రధాన కార్యదర్శి శెట్టి శ్యామ్ సహా పలువురు ప్రముఖులు పార్టీలకు అతీతంగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... పాకిస్తాన్ అనుసరిస్తున్న ఉగ్రవాద అనుకూల కార్యకలాపాలపై మండిపడ్డారు. ఖచ్చితంగా పాకిస్తాన్‌కి భారత ప్రభుత్వం బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని తుద ముట్టించేందుకు ప్రపంచ దేశాలన్నీ భారత్‌కు మద్దతుగా నిలుస్తున్నాయన్నారు. ప్రపంచానికి పెనుముప్పుగా మారిన ఉగ్రవాదాన్ని అంతమొందించిన నాడే పహల్గాం మృతులకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. అనంతరం పాకిస్తాన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి నాయకులతో పాటు హిందూ అనుబంధ సంఘాలు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి'

భైంసా, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో నరమేదానికి పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కొమ్రేవార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మరోమారు ఎక్కడ కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు గాను చర్యలు తీసుకోవాలన్నారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను తగు రీతిలో ఆదుకోవాలన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిక

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం బాగులవాడకు చెందిన మాజీ కౌన్సిలర్ మెంగా పోశెట్టి శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.నియోజకవర్గ ఇన్‌చార్జి కే. రాంకిషన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము సమక్షంలో పోశెట్టి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనను కండువాతో పార్టీలోకి ఆహ్వానించారు.

నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

ఖానాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు దక్కేలా చర్యలు చేపట్టాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి గోవింద్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో సునీత, ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు, తదితరులున్నారు.

నిర్మాణాల పరిశీలన

కుబీర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతర్ని గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్ పరిశీలించారు. ఇండ్లు నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలన్నారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులను

అభినందించిన నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో నిర్మల్ జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం అభినందనీయమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు అన్నారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఆల్ఫోర్స్ కళాశాల విద్యార్థులు తహ్రీమ్, జోహా మహవిష్, సమ ఫిర్దోస్ బైపీసీలో ర్యాంకులు సాధించారు. ఎస్ఆర్ కళాశాల విద్యార్థిని శ్రీహర్ష 438 మార్కులు సాధించగా ఎంపీసీలో లక్ష్మీ ప్రసన్న 467 మార్కులతో రాష్ట్ర ర్యాంకు పొందడం హర్షించారు.

వడదెబ్బతో మృతి చెందిన కుటుంబాలకు పరామర్శ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలో ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన కుటుంబాలను గురువారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు పరామర్శించారు. కుర్నపేటకు చెందిన నిగులపు శంకర్, రాజు వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న శ్రీహరి రావు వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపి సంతాపం ప్రకటించారు. ఒక్కొక్క కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాందేడపు చిన్ను, నల్లూరి పోశెట్టి, అడపా పోశెట్టి, కుంట వేణుగోపాల్, తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండలంలో పర్యటన

లక్ష్మణచాంద, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు గురువారం మండలంలో పర్యటించారు. మల్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బాపట్ల ఆశన్న కోడలు బాపట్ల హేమశ్రీ ప్రసూతి కోసం ఆసుపత్రికి వెళ్లి బాబుకు జన్మనిచ్చిన అనంతరం గుండెపోటు వచ్చి అకస్మాత్తుగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాడ సంతాపం తెలిపారు. లక్ష్మణచాందలో అష్టభుజ వేణుగోపాల స్వామి ఆలయ పూజారి రమేష్‌శర్మ ఇటీవలే అనారోగ్యంతో మరణించగా ఆయన కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, లక్ష్మణచాంద మాజీ సర్పంచ్ అట్ల రామ్‌రెడ్డి, నాయకులు గాజుల రవి కుమార్, సిరాజుద్దీన్, గురాల లింగారెడ్డి, చింతకింది శేఖర్‌రెడ్డి, బిట్లింగ్ రజినీకాంత్, ముత్యం, రాజు, తదితరులు ఉన్నారు.

సారంగాపూర్ మండలంలో..

సారంగాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల యాక్‌ర్‌పల్లి గ్రామానికి చెందిన నిమ్మల రాజు అనే వ్యక్తి ఇటీవలే అనారోగ్యంతో దుబాయిలో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడిశ్రీహరిరావు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రూ. 5లక్షల ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని హామి ఇచ్చారు. అలాగే ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీటీసీ శాంతబాయి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, మండల పార్టీ అధ్యక్షులు బొల్లోజీ నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దశరథ్ రాజశ్వేర్, నాయకులు సత్యపాల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, మధుకర్‌రెడ్డి, భూమారెడ్డి, రవీందర్ రెడ్డి, సుమన్, కొట్టె శేఖర్, గాజుల రవికుమార్‌లున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలను అరికట్టవచ్చు

కడెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టే అవకాశం ఉందని ఖానాపూర్ సీఐ అజయ్ అన్నారు. గురువారం కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో సీసీ కెమెరాల అవగాహన పట్ల అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.



ర్యాంకు సాధించిన విద్యార్థులతో నరేందర్ రెడ్డి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఖ్యాతిని రెట్టింపు చేసిన ఇంటర్ ఫలితాలు

● ఆల్ఫోర్స్ సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆల్ఫోర్స్ కళాశాల విద్యార్థులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉత్తమ రాష్ట్ర, జిల్లా ర్యాంకులు సాధించి ఖ్యాతిని రెట్టింపు చేశారని ఆ సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్‌లో అగ్రస్థాయిలో నిలవడం చారిత్రక విజయమన్నారు. ఫలితాల సాధనలో అధ్యాపకుల కృషి ఎంతగానో ఉందని ప్రశంసించారు. తల్లిదండ్రులు అందించిన సహకారం అమూల్యమైందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఎస్. కృష్ణవేణి 468, జ్యోషి ప్రసూన 468, బోనాల చరణ్ 467, కీర్తిశ్రీ 468, అఖిల్ 467, కార్తికేయన్ 467, వి.అఖిల్ 467, సాయి ఐశ్వర్య 467, ఎస్. వంశిక 466, సాయి ప్రణవ్ 466, ఎస్. శ్రీహిత 466, కార్తిక 465, త్రిషర 465, తన్మయి 465, శివాని 465, వైశాలి 465, జోహా అలీన 465, సుచరణ్ 465 మార్కులతో ఉత్తమ రాష్ట్ర ర్యాంకు సాధించారన్నారు. మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను ఫిర్దోస్, జోహా మహవిష్, తహరిన్ 438 మార్కులు సాధించారని తెలిపారు. మోహవిష్ నీరా, బిందు 437, స్ఫూర్తి, రాగసిద్ధిక, మజీద్ ఖాన్ 436, మోహ రీన్, హారిక 435 మార్కులు సాధించారన్నారు. ఎంపీసీ రెండో సంవత్సరంలో 1000 మార్కుల కు జాదవ్ నవ్య 993, ఎస్‌సీ భావన 991 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో ఎస్. కావాల్ ప్రీతి కౌర్ 995, సుమయ్య ఖానం 994, దీప్తి షైనీ 991 మార్కులు సాధించారన్నారు. ర్యాంకు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని కళాశాలకు, జిల్లాకు వన్నె తేవాలని ఆకాంక్షించారు.


ర్యాంకు సాధించిన విద్యార్థులు

ఆంధ్రజ్యోతి లక్కీడ్రా విజేతలకు బహుమతుల అందజేత

నిజామాబాద్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అక్షరమే ఆయుధంగా దమ్మున్న కథనాలతో ప్రజల పక్షాన నిలుస్తున్న 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు పట్టం కట్టింది. ఆంధ్రజ్యోతి 22వ వార్షికోత్సవం సందర్భంగా మార్చి 24వ తేదీన నిర్వహించిన 'కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా'లో నిజామాబాద్ యూనిట్ పరిధిలో విజేతలుగా నిలిచినవారు గురువారం సాయంత్రం నిజామాబాద్ యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందుకున్నారు. ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ నల్ల తిరుపతిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జీ గుడ్ల సంజీవ్ కుమార్, బ్యూరో ఇన్‌చార్జీ సంపత్‌రావు, అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ మార్క భాస్కర్, అకౌంటెంట్ శేఖర్ విజేతలకు బహుమతులు అందజేశారు. లక్కీడ్రా నిర్వహణలో భాగంగా గతేడాది నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు 4నెలల పాటు కూపన్లను ప్రచురించి వాటిని పాఠకుల ద్వారా స్వీకరించి.. గత మార్చి 24న నిజామాబాద్ అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రామోజీరావు, డిచ్‌పల్లి ఎస్సై యండి షరీఫ్ చేతుల మీదుగా డ్రా తీశారు. అతిథులు నిజామాబాద్‌యూనిట్ (నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు) పరిధిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతోపాటు 100 మంది కన్సోలేషన్ విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మొదటి బహుమతి విజేతగా నిలిచిన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన తిరునగిరి వెంకట రమణకు గురువారం 100సీసీ బైక్‌ను అందజేశారు. అలాగే ద్వితీయ బహుమతి విజేత కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలకేంద్రానికి చెందిన నందాల రాంచందర్‌కు 185లీటర్ల రిఫ్రిజిరేటర్‌ను అందజేయగా, మూడవ విజేతగా నిలిచిన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రానికి చెందిన రహీమున్నీసాకు 32 ఇంచుల టీవీని అందజేశారు. విజేతలు మాట్లాడుతూ.. పాఠకులుగా ఉన్న తాము ప్రతీరోజు ఆంధ్రజ్యోతి దినపత్రిక చదవడంతోనే తమ దినచర్య మొదలవుతుందని పేర్కొన్నారు. పాఠకుల కోసం 'ఆంధ్రజ్యోతి' ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు.


ప్రథమ విజేత తిరునగిరి వెంకట రమణకు బైకును అందజేస్తున్న ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ నల్ల తిరుపతిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జ్ గుడ్ల సంజీవ్ కుమార్, బ్యూరో సంపత్‌రావు, అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ మార్క భాస్కర్


రెండవ బహుమతి రిఫ్రిజిరేటర్‌ను అందుకుంటున్న రాంచందర్


మూడవ బహుమతి టీవీని అందుకుంటున్న రహీమున్నీసా


కన్సోలేషన్ బహుమతిని అందుకుంటున్న విజేత

వైభవంగా ఓంకారేశ్వర ఆలయ వార్షికోత్సవ వేడుకలు


ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఆలయ యగశాలలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

ఖానాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్లపాడ్ గ్రామంలో గల శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ అర్చకులు మామిడిపల్లి హరీష్ చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5 గం టలకు సుప్రభాత సేవ, వేద పారాయణం, స్వామివారికి పంచామృత అభిషేకం, 8 గంటలకు కుంభాభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవ చనం, కంకణధారణ, అఖండ దీప ప్రజ్వలన, అంకురారోపణం, సర్వతో భద్ర మండలి ఆ వాహన, మధ్యాహ్నం అన్న పూజ, పూర్ణాహుతి, తీర్థ ప్రసాదం, ఆశీర్వచనం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆ లయ ప్రాంగణంలో భక్తులకు ఘనంగా అన్నదానాన్ని ఏర్పాటు చేశా రు. ఈ వేడుకలకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ వార్షి కోత్సవ వేడుకలను పురస్కరిం చుకొని ఆలయంలో బీఆర్ఎస్ ఖానా పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ సహా పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మత్స్య సంపద పెరగాలని గ్రామదేవతలకు జలాభిషేకం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని, చెరువు కుంటాలు నిండాలని కాంక్షిస్తూ, గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆదిలాబాద్‌లో నీళ్లపోత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చించార్వాడ నర్సింహస్వామి ఆలయం నుంచి నీళ్ల పోత కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోచమ్మ ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించి వర్షాలు సమృద్ధిగా పడాలని పూజలు చేశారు. మత్స్య సంపద పెరగాలని గ్రామ దేవతలకు జలాభిషేకం చేశామన్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు భోజన్న, కొమురయ్య, గుడిపల్లి నగేష్, సునీల్, అరుణ్, సంజయ్ పాల్గొన్నారు.

స్తంభం బిగించారు.. బల్బులు మరిచారు!

బోథ్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ప్రాంతంలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి ఆ తర్వాత స్తంభానికి విద్యుత్ అమర్చలేదు. దీంతో బల్బులు లేక ఆ ప్రాంతమంతా అంధకారంగా మారింది. అధికారులు విద్యుత్ స్తంభానికి బల్బులు బిగించాలని కోరుతున్నారు.


బోథ్ మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన స్తంభానికి బల్బులు లేకుండా కనిపిస్తున్న దృశ్యం

బస్సు షెల్టర్‌పై పెరిగిన చెట్టు

ఉట్నూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కవితకు కాదేది అనర్హం అన్నట్లుగా, చెట్టు పెరగడానికి కాదేది స్థలం అన్నట్టు పెరిగింది. ఈ చెట్టు. ఉట్నూర్ మండలంలోని పెరకగూడెం వద్ద రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన బస్ షెల్టర్ ప్రయాణికులకు ఏ మాత్రం ఉపయోగంలోకి రాకపోయినా చెట్టు పెరగడానికి మాత్రం అనువైందని ప్రజలు అంటున్నారు. లక్షల రూపాయలతో నిర్మించిన బస్సు షెల్టర్‌ను వినియోగంలోకి తేవడంతో స్థానిక ప్రజా ప్రతినిధులు విఫలం అయ్యారని ఫలితంగా పిట్టగూడెం, మత్తడి గూడ, టక్కుగూడ, పెర్క గూడ ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడి బస్సుల కోసం వేచిచూస్తు న్నారన్నారు. ఇప్పటికైనా బస్సు షెల్టర్ లోపలి నుంచి పెరిగిన చెట్టును తొలగించి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పెర్కగూడ వద్ద బస్సు షెల్టర్‌పై పెరిగిన చెట్టు


సెల్యూట్ చేస్తున్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

పోలీసు జాగిలానికి అంత్యక్రియలు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 2013 బ్యాచ్‌కు సంబంధించిన పోలీసు జాగి లం తార ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు పేలుడు పదార్థాలు కనుగొనడంలో విశేష సేవలు అందించింది. అలాంటి తార గురువారం అనారోగ్యంతో చనిపోయింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అంత్యక్రియల్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని తారకు శాలువా, పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. తార అందించిన సేవలకు జిల్లా ఎస్పీ సెల్యూట్ చేస్తూ తన సేవలకు సరైన గౌరవం అందించారు.

ఉగ్రమూకల దాడిని నిరసిస్తూ కాంగ్రెస్ కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న అర్జుమన్ అలీ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో యాత్రికులపై ఉగ్రదాడిని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించింది. గ్రంథాలయ ఛైర్మన్ అర్జుమన్ అలీ ఆధ్వర్యంలో దాడిలో మృతి చెందిన వారిని నివాళులర్పిస్తూ ట్యాంక్ బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండించారు. మృతులకు సంతాపం తెలిపారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చిన్ను, సత్యనారాయణ, అజహర్, ఇమ్రాన్ ఉల్లా, జునైద్, మతీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

ఉట్నూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ సమ స్యల పరిష్కారం కోసం వారం వారం కార్యాలయం చుట్టూ తిరగకుండా ఉండడానికి నేరుగా ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం చేపట్టిందని ఉట్నూర్ మండల ప్రత్యేక అధికారి, ప్రజావాణి ప్రీ సేడింగ్ ఆఫీసర్ సుధాకర్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు కృషి చేస్తున్నార న్నారు. ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన రైతుబంధు, గృహలక్ష్మి, గృహ జ్యోతి, గ్యాస్ సబ్సిడీ అంశాలను పరిష్కరించడం జరిగిందని తెలి పారు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయా ల్సిన అవ సరం ఉందని దరఖాస్తులు చేసుకున్న వారికి ప్రభుత్వం మార్పులు చేర్పులు చేసి కొత్త కార్డులు ఇవ్వడానికి ప్రణాళిక చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, శ్యాంసుందర్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, వ్యవసాయ అధికారి రమేష్, ఏటీడీఓ క్రాంతి కుమార్, డీటీ ఇన్ఫోర్స్మెంట్ ప్రేమ్ నివాస్ పాల్గొన్నారు.

దుర్గాపూర్‌లో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

ఉట్నూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని దుర్గాపూర్ గ్రామంలో మంచినీటి ట్యాంకుకు నీరు అందించే బోరు బావి చెడిపోవడంతో రెండు రోజులుగా దుర్గాపూర్ గిరిజనులు మంచినీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏ పనులు చేయడానికి కూడా నిధులు లేకపోవడంతో మరమ్మతులు చేయ లేకపోతున్నామని పంచాయతీ అధికారులు చేతులెత్తేశారు. దీంతో మాజీ సర్పంచ్ యశోద బాయి తన సొంత ఖర్చులతో పంచాయతీ నీటి ట్యాంకర్ ద్వారా దుర్గాపూర్ గిరిజనులకు మంచి నీరు సరఫరా చేస్తున్నారు. ఉన్నతాధికారులు బోరు బావుల మరమ్మతుల కోసం పంచాయతీలకు నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.


ట్యాంకర్ ద్వారా నీరు అందుకుంటున్న గిరిజనులు

కరెంట్ కోత.. రైతుకు గోస!

బేల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏకోరి గ్రామంలో రబీ సీజన్‌లో సాగుచేస్తున్న మక్క పంటకి నీరు అందక పంట ఎండిపోతుంది. బావి నీరు అందించాలి అనుకున్న రైతుకు కరెంట్ కష్టాలు డీటీసీఓ ఎదురయ్యాయి. ఇష్టానుసారంగా గంటల తరబడి కరెంట్ కోతలు విధిస్తున్నారు అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులుగా కరెంట్ లేకపోవడంతో తీవ్ర ఎండలకు నీరు అందక పంట ఎండి పోయింది. సంబంధిత విద్యుత్ అధికారులకు సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా విని పించుకోవడం లేదని బాధిత రైతు వాపోతున్నారు. దీంతో నష్టం వాటిలుతుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఎండిపోయిన మక్క పంట


ప్రమాదకరంగా మారిన రహదారి


రహదారి వెంట.. మురుగు నీటి తంటా!

కుభీర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వివేకానంద స్వామి చౌరస్తా నుంచి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలతో గుంతలు ఏర్పడి మురుగు నీరు నిలుస్తోంది. ఈ రహదారి గుండా ఎంపీడీవో, ఉపాధిహామి, ఐకేపీ, విద్యావనరుల కేంద్రం, వ్యవసాయశాఖ, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథతో పాటు ఆయా శాఖల అధికారులు మండల పరిషత్‌తో పాటు ఆయా కార్యాలయానికి రాకపోకులు చేస్తుంటారు. అయిన ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదని ఆ రహదారి గుండా వెళ్లే కస్రా, సొనారి, మాలేగాం, నిగ్వా, కుప్టి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురికి నీటిని రహదారి వైపు మళ్లించిన కాంప్లెక్స్ యజమానిపై చర్యలు తీసుకొని ప్రమాదాలు జరుగకుండా రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

మురుగు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

కుభీర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పోలీస్‌స్టేషన్ వెళ్లే ప్రధాన రహదారిలో గల మురికి కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. దీంతో మురుగు ముందుకు పారడం లేదు. మురుగు ఒకే చోట నిల్వ ఉండడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో పాటు ఈగలు, దోమల బెడద పెరిగిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే తాము రోగాల భారిన పడతామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువలోని వ్యర్థాలు తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


మురికి కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు







● ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన ఆదిలాబాద్ చౌక్

జిల్లాలో రెడ్ అలర్ట్!

- జిల్లాలో 45 డిగ్రీలకు చేరిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- రారెత్తిస్తున్న ఎండలతో జనం ఉక్కిరి బిక్కిరి
- అప్రకటిత విద్యుత్ కోతలతో చెట్ల నీడన సేద తీరుతున్న జనం
- మరికొన్నాళ్ల పాటు అప్రమత్తంగా ఉండాలని వైద్యుల హెచ్చరికలు
- జిల్లా వ్యాప్తంగా వేగంగా పడిపోతున్న భూగర్భజలాలు

ఆదిలాబాద్, ఏప్రిల్, 24 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు పగటి ఉష్ణోగ్రతలు అమాతంగా పెరిగిపోతున్నాయి. రారెత్తిస్తున్న ఎండలతో ఉదయం 10 గంటలకే జనజీవనం పూర్తిగా స్తంభిస్తోంది. ఎండల తీవ్రతకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి లాక్‌డౌన్ పరిస్థితులను తలపిస్తున్నాయి. గురువారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా తాంసి మండలంలో 45.2, తలమడుగులో 45.0, ఆదిలాబాద్ రూరల్‌లో 44.8, బెలలో 44.7, సిరికొండలో, 44.6, డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. జిల్లా వ్యప్తంగా 42 డిగ్రీలకు పైగానే పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో అధికారులు అధికారులు రెడ్ అలెర్ట్‌ను ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భారత వాతావరణ పరిశీలన విభాగం (ఐఎండీ) అధికారులు హెచ్చరికలు జారీచేశారు. అప్రమత్తమైన రెవెన్యూ, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక శాఖల అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. రైతులు, కూలీలు ఉదయం సాయంత్రం వేళల్లోనే వ్యవసాయ పనులు చేసుకోవాలని సూచిస్తున్నారు.

బెంబేలెత్తిపోతున్న జనం..

మండిపోతున్న ఎండల తీవ్రతకు జనం బెంబేలెత్తి పోతున్నారు. ఉదయమే 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో బాబోయ్ ఇవేం ఎండలు.. అంటూ జనం అల్లాడుతున్నారు. ఏప్రిల్‌లోనే 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో అధికారులు రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు. రాబోయే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతుంది. ముఖ్యంగా విధి వ్యాపారులు ఎం డల తీవ్రతకు విలవిలలాడుతున్నారు. గిరాకీలు లేకపోవడంతో ఇల్లు గడవడం లేదని వాపోతున్నారు. గత పదేళ్లలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదంటూ చెబుతున్నారు. క్షణం విద్యుత్ అంతరాయం ఏర్పడినా ఇంట్లో ఉండలేని పరిస్థితి ఉందంటున్నారు. గ్రామాల్లో అప్రకటిత విద్యుత్తు కోతలతో చెట్ల నీడను ఆశ్రయిస్తూ సేద తీరుతున్నారు. ఏసీ కూలర్లు, ఫ్యాన్ల వినియోగం భారీగా పెరిగిపోతోంది. దీంతో వేసవిలో విద్యుత్తు బిల్లుల మోత మోగిపోతుందని చెబుతున్నారు.

ప్రమాదకర పరిస్థితి..

ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. నీటి జాడలు అడుగంటుక పోవ డంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. మార్చి చివరి నాటికి జిల్లా సగటు భూగర్భ జలమట్టం 8.54 మీటర్లకు చెరుకుంది. దీంతో పలు వండలాల్లో తీవ్రమైన నీటిఎద్దడి కనిపిస్తోంది. ఇచ్చోడ మండలాన్ని డ్రై మండలంగా అధికారులు ప్రకటించారు. అలాగే తలమడుగు, గుడిహత్నూర్, గాదిగూడ, జైనాథ్, బేల, నర్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాలకు తీవ్రమైన నీటిఎద్దడి సమస్య కనిపిస్తోంది. ఇప్పటికే వాగులు, కుంటలు, చెరువులు అడుగంటుకుపోవడంతో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు వేగంగా పడిపోతున్నాయి. మత్తడివాగు, సాత్నాల ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నాయి. కేఆర్‌కే, తాటిగూడ, ఓల్డ్ హౌజింగ్ బోర్డు, కైలాష్ నగర్, కాలనీల్లో పలు ఇండ్లలో బోరుబావులు అడుగుంటుకుపోయాయి. దీంతో ట్యాంకర్ల ద్వారా నీటిని కొని తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. సాగునీటి ఎద్దడితో జిల్లాలో వేల ఎకరాలలో చేతికొచ్చిన పంటలు ఎండిపోయిన పరిస్థితి కనిపిస్తోంది.

జిల్లాలో ఉష్ణోగ్రతల వివరాలు..

ఏప్రిల్ 20,	43.8	25.2
ఏప్రిల్ 21,	43.5	26.7
ఏప్రిల్ 22,	43.8	29.2
ఏప్రిల్ 23,	44.3	30.2
ఏప్రిల్ 24,	44.3	28.7

ఉష్ణోగ్రతల తీవ్రతను తెలిపే విధానం..

- 0-35 డిగ్రీలు గ్రీన్ అలర్ట్
- 35-40 డిగ్రీలు ఎల్లో అలర్ట్
- 40-45 డిగ్రీలు ఆరెంజ్ అలర్ట్
- 45 డిగ్రీలకు పైగా రెడ్ అలర్ట్



బయటకెళ్లాలంటే.. భయమేస్తుంది..

: నిమ్మల సంతోష్‌రెడ్డి, ఇచ్చోడ

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరుగుతున్నాయి. గత వారం నుంచి మధ్యాహ్నం సమయంలో బయటకి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఎదురైంది. ఏప్రిల్‌లోనే ఎండలు 42 నుంచి 46డిగ్రీల వరకు ఉంది. రాబోయే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా విధి వ్యాపారులు మత్రం ఎండల తీవ్రతకు విలవిలలాడుతున్నారు. ఇచ్చోడ మండలంలో భూగర్భజలాలు అడుగంటడంతో మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. ఆదిలాబాద్ జిల్లాలోనే ఇచ్చోడ మండలాన్ని డ్రై మండలంగా అధికారులు గుర్తించారు. ఎండలకు జాగ్రత్తలు తీసుకుంటూ.. వైద్యుల సలహాలు తీసుకోవాలి.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం..

:డాక్టర్ నరేందర్ రాథోడ్ (డీఎంహెచ్‌వో)



జిల్లాలో ఎండల తీవ్రత పెరిగిపోవడంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవలే 2లక్షల ఓఆర్ఎస్ ప్యాకెట్లు జిల్లాకు వచ్చాయి. అన్ని మండలాలకు పంపిణీ చేశాం. ప్రజలు అత్యవసరమైతే తప్ప.. ఎండలో బయటకు వెళ్లవద్దు. ఇప్పటివరకు జిల్లాలో వడ దెబ్బ బారిన పడి ఎవరూ మృతిచెందిన దాఖలాలు లేవు.



తలకు రుమాలు కట్టుకున్న ప్రయాణికులు

సాంప్రదాయ వంటలతో ఆరోగ్యం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్
- ఘనంగా ఇప్పపువ్వు పండుగ
- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా ఇప్ప పువ్వు పండుగను నిర్వహించారు. గోండ్ వాన పంచాయతీ రాజ్ సెంటర్, ఐటీడీఏ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇప్ప పువ్వులతో తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు. ఆదివాసీ మహిళలు, ఆదివాసీ పద్ధతుల సాంప్రదాయ వంటకాలను అతిథులకు తినిపించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ అద్భుతమైన పోషక విలువ లున్న ఈ మిఠాయి కావాలంటే ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రానికి వెళ్లాల్సిందే అన్నారు. ప్రత్యేక కేంద్రంలో ఆదివాసీ మహిళలు ఈ లడ్డూ లను తయారు చేస్తున్నారని వేరే వేరే ప్రాంతం నుంచి మన మొవా లడ్డు తీసుకుపోవడం సంతోషకరమన్నారు. గిరిజన బాలికలకు గర్భిణులకు ఎల్లప్పుడూ అందిస్తూ ఉంటే వారు ఆరోగ్యంగా ధృడంగా ఉంటారన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఇప్పపువ్వ లడ్డూను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఆదివాసీ మహిళలను ప్రశంసించడం గమనార్హం అన్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహజాన్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల సాంప్రదాయ వంటలు బాగున్నాయన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్త మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన బాలికల్లో రక్తహీనత సమస్య ఎక్కువని, ఆదివాసీ మహిళలు సాధారణంగా ఇండ్లలో ఇప్పపువ్వు లడ్డూ తయారు చేసుకోవడం మంచిదని అన్నా రు.



వంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు



మామిడి పండ్ల స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, పీఓ

గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన దివ్య దేవరాజన్ చొరవతో 2019లో ఉట్నూర్ ఎక్స్ రోడ్డులో రూ.14 లక్షలతో ఆదివాసుల ఆహార కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ ఆదివాసీ భీంబాయి మహిళా గ్రూప్‌నకు చెందిన 12 మంది గిరిజన మహిళా సంఘం సభ్యులు ఇప్ప పువ్వు లడ్డూలను తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారని ప్రశంసించారు. సబ్‌కలెక్టర్ యువ రాజ్ మర్మాట్, మహిళా కమిషన్ సభ్యులు కుమ్ర ఈశ్వరి బాయి, దురుగు పటేల్, సహకార మిత్ర సంస్థ మేనేజర్ కొమ్ర విఠల్‌రావు, పెసా కోఆర్డినేటర్ అరక వసంతరావు, జిల్లా మేడి మెస్రం దుర్గు పటేల్ రాయి పాల్గొన్నారు.

సేంద్రియ మామిడి పండ్లతో ఆరోగ్యం

ఉట్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సహజ సిద్ధంగా పండిన ఆదివాసీ సేంద్రియ మామిడి పండ్ల స్టాల్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తాతో కలిసి ఖానాపూర్ శాస నసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ గురువారం ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహజ సిద్ధంగా పండించిన మామిడి పండ్లను వినియోగించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి సందీప్ కుమార్, నాబార్డు జిల్లా మేనేజర్ అబ్దుల్ రావూఫ్, సీపీఎఫ్ సంస్థ అధికారి సత్యనారాయణ, సీఈఓ న్యాను, తిరుమలేష్, రైతులు అర్క ఉమేష్, జాకు పటేల్, ఉద్యాన విభాగ సిబ్బంది అర్షిత, సాయి రాజ్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం : ఎమ్మెల్యే

అర్హులైన ప్రతి పేదకుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే ప్రభుత్వ ఉద్దేశమని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని సుద్దగూడ గ్రామంలో 39 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించిందన్నారు. నిజమైన లబ్ధిదారులకు వంద శాతం ఇండ్లు ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలోని మంచినీటి బావిని పరిశీలించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో బోర్లువేసి, ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ బానోత్ వసంత రావు, ఉట్నూర్ మండల పార్టీ అధ్యక్షులు ఖయ్యూం, ఆర్టీవో జిల్లా సభ్యుడు దూట రాజేశ్వర్, నాయకులు, కార్యదర్శి ఉప్పుల సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య దారుణహత్య



కీర్తి (ఫైల్)

గుడిహత్నూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కత్తితో పొడిచి.. ఆ పై గొంతు కోసి భార్యను దారుణంగా హత్యచేసిన ఘటన గురువారం గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని గుడిహత్నూర్ మండలకేంద్రానికి చెందిన లాటపటే మారుతికి అదే గ్రామంలోని కీర్తి(27)తో గత పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. కొంతకాలం వరకు వీరి సంసారం సాఫీగా సాగింది. మారుతి ఐదేళ్ల క్రితం డెయిరీ ఫామ్ నిర్వహించగా.. వ్యాపారంలో నష్టపోయి రూ. 8లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. దీంతో భార్యభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఇదే క్రమంలో మారుతి మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో విషయం తెలుసుకున్న కీర్తి.. భర్త మారుతిని నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు రోజురోజుకూ తీవ్రమయ్యాయి. ఇటీవల వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను కూడా ఇంటికి తీసుకొస్తానని మారుతి భార్యతో రోజూ గొడవ పడుతున్నాడు. దీంతో 20రోజుల క్రితం పెద్దల సమక్షంలో ఈ విషయమై దంపతుల మధ్య పంచాయితీ కూడా జరిగింది. దీంతో కీర్తి తన పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్న భార్యను హత్య చేయాలని మారుతి నిర్ణయించుకు న్నాడు. గురువారం కీర్తి తల్లిదండ్రు లు పని నిమిత్తం బయట వెళ్లిన సమయంలో అదే గ్రామంలో ఉన్న కీర్తి ఇంటికి మారుతి అక్కడికి వచ్చా డు. మరో మహిళను ఇంటికి తీసుకువస్తానని సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా.. ఆమె ఇందుకు నిరాకరించింది. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. తాను మంచి నీటిని తీసుకొస్తానని ఇంటి నుంచి కీర్తి బయటకు వెళుతున్న సమయంలో వెనుక వైపు నుంచి వచ్చిన మారుతి అప్పటికే తన వద్ద ఉన్న కత్తితో ఆమెను పొడిచి.. గొంతు కోసి పరారయ్యాడు. గమనించిన స్థానికులు జరిగిన దారుణంపై పోలీసులకు సమాచారం అందించారు. రక్తపు మడుగులో ఉన్న కీర్తిని స్థానికులు 108 అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే కీర్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా.. హత్య జరిగిన స్థలాన్ని ఇచ్చోడ సీఐ భీమేష్ పరిశీలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మారుతిని త్వరలో పట్టుకుంటామన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

● జిల్లా కలెక్టర్ రాజార్షి షా

ఇచ్చోడ, బజార్‌హత్నూర్, 24 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల సత్వర పరిష్కారానికే భూ భారతి చట్టం-2025ను ప్రభుత్వం తీసుకువచ్చిందని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైతుల మేలు కోరి ప్రభుత్వం ప్రజాపాలనలో చారిత్రక మార్పులు తెచ్చిందని వివరించారు. దీని ద్వారా భూమి హక్కులు భద్రంగా ఉంటాయని, హక్కుల పూర్తిరికార్డు పారదర్శకంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, జేసీ శ్యామల, ఆర్డీవో వినోద్, అడ్డి భోజారెడ్డి పాల్గొ న్నారు.



బజార్‌హత్నూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

గుడిహత్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించేందుకే విప్లవాత్మకమైన భూ భారతి చట్టం రూపొందించిందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం మండలంలోని మన్నూర్‌లోని ఎస్. కన్వెన్షన్ హాల్‌లో భూభారతి చట్టంపై అవగా హన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భూ భారతి చట్టం ద్వారా భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరి ష్కారం లభిస్తుందని తెలిపారు. సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ కవిత రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భాగ్య లక్ష్మి, ఎంపీడీవో అబ్దుల్ హై, ఏవో రమేష్, మన్నూర్ పీఏసీఎస్ చైర్మన్ కరాడ్ ప్రకాష్, ఆర్ఐ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

26 వరకు జొన్న పంట కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ యార్డులో జొన్నపంట కొనుగోలును శనివారం వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలిస్వామి తెలిపారు. మార్కెట్‌యార్డులో జొన్న పంట నిల్వలు పేరుకుపోయినందున పంట కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలిస్వామి తెలిపారు. సోమవారం షెడ్యూల్ ప్రకారం జొన్నపంట కొనుగోలు చేస్తామన్నారు. రైతులు గమనించాలని కోరారు.

రౌడీయిజం చేసే వారిపై కఠిన చర్యలు : ఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా రౌడీయిజం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో గురువారం ఏర్పాటు చేసిన రౌడీమేళాలో ఆయన మాట్లాడారు. ఆకారణంగా గొడవల్లో తలదూర్చడం, బలవంతపు వసూళ్లకు పాల్పడటం లాంటి చర్యలను మానుకోవాలని ఆయన వారికి సూచించారు. తరచూ రౌడీయిజానికి పాల్పడే వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

వేధిస్తున్న వ్యాపారులపై చర్యలు...

రైతులు, అమాయక ప్రజల నడ్డి విరుస్తూ వారి రక్తాన్ని పిండి పీడిస్తున్న వడ్డీ వ్యాపారస్తులపై ఎస్పీ అఖిల్ మహాజన్ కొరడా ఝులిపించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఏకకాలంలో 10 మండలాల్లో 30 బృందా లతో ఆకస్మిక దాడి చేశారు. జిల్లా వ్యాప్తంగా 10 మండలాలలోని 31 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అమాయక ప్రజలను మోసం చేస్తూ ప్రజల అవసరాలకు అధిక వడ్డీలను వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయి..

పోలీసు వ్యవస్థలో నిరంతరంగా సేవలందించి పదోన్నతి పొందుతున్న కానిస్టేబుళ్లకు ఎస్పీ అఖిల్ మహాజన్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి అభినందనలు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న పదిమంది పోలీసు కానిస్టేబుల్లకు హెడ్‌కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందారు. మొత్తం 28 మందికి పదోన్నతి రాగా అందులో ఆదిలాబాద్ జిల్లా వారు పది మంది ఉండడం సంతోషకరమని ఎస్పీ అన్నారు.



పదోన్నతి పొందిన పోలీసులతో ఎస్పీ

ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు



ఫైర్ సేఫ్టీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ గురువారం సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆస్పత్రిలోని పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఫైర్ సేఫ్టీను పర్యవేక్షించారు. అగ్నిమాపక పరికరాల ముగింపు తేదీ, వాటి పట్ల సిబ్బందికి ఉన్న అవగాహన విషయాన్ని పరిశీలించారు. వేసవి కాలంలో జరిగే అగ్ని ప్రమాదాల నివారణ కోసం ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యాలయ సిబ్బంది రాంప్రసాద్ ఉన్నారు.